మనిషి ఆశాజీవి తన జీవితంలో యేదో అద్భుతం జరగబోతోందన్న విశ్వాసంతో వుంటాడు దానికి చాలా బలం వుంటుంది. కాని చివరికి మనిషిని మనిషే ఆదుకోవడం అద్భుతాలన్నిటి కన్నా అద్భుతం కాదా!

# తెల్లవారుతోంది....

అప్పారావు బార్బరు షాపు తలుపుతీశాడు. నుదుట నయా పైసా అంత కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. దేవుడి పటం ముందు నిల్చుని, అగరవత్తి వెలిగించి పూజ చేశాడు ఎన్ని అగర వత్తులు ఆరగించాడో మరి ఆ దేవుడు పొగచూరి ఆకారం తెలీకుండా వున్నాడు.

ఆ షాపు ఎదురుగ్గా తాలూకా ఆఫీసుంది. దాని పిట్టగోడ నానుకుని డ్రైనేజి. దాన్నానుకుని పేవ్‌మెంటు. ఆ పేవ్‌మెంటు మీద నాలుగు సినిమాల తాలూకు పోస్టర్ల స్తంభాలు వున్నాయి. మరికాస్త ఎండొచ్చాక సన్యాసి తన సరంజామాతోవచ్చాడు. డ్రైనేజిపక్క పేవ్ మెంటు మీదకి. ఓ స్తంభం మొదట్లో శుభ్రంచేసి గోనె పరిచాడు. ఓ ఇటుకరాయి ఆన్చి కాళీమాత ఫొటో పెట్టాడు. మరో ప్రక్క అరచెయ్యి బొమ్మలున్న రెండు పటాలు వుంచాడు. మధ్యగా చిలుక పంజరం పెట్టి పెట్టి, దాని ప్రక్కన కూర్చున్నాడు. ధూపం వెలిగించి మూడు నిముషాలు కళ్ళు మూసుకున్నాడు. ఆ తర్వాత రోడ్డుకేసి. రోడ్డుమీదవచ్చే పోయే మనుషులకేసి. అంటే వాళ్ళ బలహీనతలకేసి చూస్తూ కూర్చున్నాడు సన్యాసి.

అప్పారావు షాపు బయటకొచ్చి నిల్చున్నాడు. రోడ్డుమీద జనాన్ని. అంటే మాసిన గెడ్డాల్ని. తలల్ని వెతుకుతూ చూస్తూ. ఎదురుగా అప్పుడే సిద్ధమైపోయిన సన్యాసిని చూశాడు. చిరునవ్వు నవ్వాడు. అలా పరస్పరం చూసుకుని నవ్వుకున్నారు. వాళ్ళిద్దరి మధ్యనుంచీ నరసింహులు రిక్షా తొక్కుకుంటూ యిద్దర్నీ మార్చి మార్చి చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. ప్రొద్దున్నే వాడికి బేరం దొరికినందుకు ఈ యిద్దరూ చాలా సంబర పడిపోయారు.

"బాబాయ్ యేటలా సూత్తన్నావ్. వొవడూ రారేంటనా?" అన్న బొంగురు కంఠానికి పోయే రిక్షాని చూడ్డంమాని యిటుతిరిగాడు సన్యాసి.

"నువ్వా.... లెగిశావా?". అన్నాడు సన్యాసి ఆమె నుద్దేశించి.

"ఆఁ.... ఎదవనిద్ర పట్టిసత్తాదా? ఏలకి తొంగుంటానా? తొంగుంటే బువ్వొంటాదా?" అంటూ నిట్టూర్చిందామె.

ఆమె సీతారావమ్మ. ముప్పైయేళ్లు పైనే వుంటాయి. "అదృ రేగానీ ఇంతకీ టీ నీళ్ళయినా తాగావా?" అనడిగిందామె.

లేదని చెప్పలేదతను. నవ్వడానికి ప్రయత్నించాడు. "నాకు తెలుసు. నీకాడ డబ్బుల్లేవ్. వుండు నే దెత్తా" అంటూ పది గజాల దూరంలోవున్న టీ కొట్టుకెళ్ళింది. ఆమె అక్కడ నిల్చున్న కాసేపు అప్పారావు జనాన్ని చూడ్డం మానేశాడు.

సన్యాసి పెట్టెలోవున్న చిలకని చూసుకున్నాడు. అందులో కలతిరుగుతోందది. కటకటాలముందుగా పేర్చివున్న కవర్లని అటూ ఇటూ వదేసి ఓ కవరు ముక్కుతో పట్టుకునే ఆట ఎప్పుడు ఆడుకుందామా అన్నట్లు తిరుగుతోందది.


సరిగ్గా ఆ టైముకే శనగపప్పూ వగైరా పప్పుల బండి తోసుకుంటూ హడావుడిగా వెళ్తున్నాడు రామారావు. ఎండెక్కిపోయిందన్న తొందర వాడిలో వుంది. ఆలస్యంగా మెలకువ వచ్చినందుకు పట్టిన మొద్దు నిద్రని తిట్టుకుంటూపోతున్నాడు. అప్పారావు ఆత్రుతనీ. సన్యాసి తాపత్రయాన్నీ చూసుకుంటూపోతున్నాడు. టీ కొట్టు నుంచి వసున్న సీతారావమ్మనీ చూశాడు. నోటితో ఈల వేశాడు. ముసిముసిగా నవ్వాడు. ఈ హుషారులో ఎదురుగా వచ్చే పోలీసుజవాను సైకిలుకి తన బండి ఢీ యిచ్చాడు.

"చస్-తొత్తుకొడకా. పొద్దున్నే పట్టించావేటి. కళ్ళు కనపట్టల్లేదూ. బొక్కలో తోసీగలున్ను...." అంటూ సుప్రభాతం వినిపిస్తూ, పడిపోయిన సైకిల్ని రామారావు తీసివ్వగా అందుకుంటూ, వంకరబోయిన హేండిల్ని, మడ్‌గారిని సరిచేసుకున్నారు జవానుగారు.

"బాబ్బాబు కంగారు గెల్లిపోతూ సూశ్నేదు. తప్పైకాయండి బాబూ-" అని మెలికలు తిరిగిపోతూ దండాలు పెట్టాడు రామారావు.

"సూడవురా. నువ్వెందుకు సూత్తావ్. ఆ గజ్జల గుర్రాన్ని సూత్తన్నావ్‌గా. దాని






ఎండ మండుతున్నకొద్దీ జనం హడావుడీ. రద్దీ ఎక్కువయ్యింది. ఆ పోయే వాళ్ళు సీతారావమ్మనీ, ఆ తర్వాత సన్యాసి సరంజామాని చూస్తూ పోతున్నారు. అలా పోతున్నవాళ్ళలో ఓ పంచికట్టు ఆసామీ పట్నానికి కొత్త మొహంలా సన్యాసి దగ్గర కొచ్చాడు ఆమెనుచూస్తూ అతన్ని ఆమే

నోకు సూత్తూ రోడ్డు మర్చిపోయావ్ తొత్తు కొడకా."

"ఏదో మాలాంటోల్లని కనికరిచ్చండి. ఈ రూపాయిచ్చుకుని కాఫీ తాగేయండి వత్తా బాబూ."

"ఊ.... ఊ.... ఎల్లెల్లు ...." ఆ రూపాయిచ్చుకుని జవానుగారు సైకిలు మీదా, ఏడవలేక నవ్వుకుంటూ రామారావు గాడు రోడ్డు మీదా అటూ ఇటూ వెళ్ళిపోయారు.

"ఎదవసన్నాసి. లెగ్గానే వొవడిమొకం చూశాడో ఈ రాబందుగోడికి రూపాయిచ్చుకున్నాడు." టీ గ్లాసు సన్యాసి కిస్తూ సణుక్కుంది సీతారావమ్మ.

రాబందునీ రసాబాసనీ చూసిన సన్యాసి మౌనంగా గ్లాసందుకున్నాడు. సన్యాసి ప్రక్కనే చతికిలబడింది సీతారావమ్మ.

పిలిచిందో. అతనేవచ్చాడో అది వాళ్ళిద్దరికే తెలియాలి.

పావలా పంజరంముందుపెట్టి సన్యాసి కెదురుగా కూర్చున్నాడా మనిషి. సీతారావమ్మని చూస్తూ.

"పావలా కేటొత్తన్నాయి కనక. ఎదవ రోజులు." స్వగతంలా అనుకుంటూ అతన్ని చూసింది సీతారావమ్మ. అతను ఉలికిపడ్డాడు. జేబులోంచి రూపాయితీసి

పావలా పక్కన పెట్టాడతను. సన్యాసి చిల కని బయటికి తీశాడు. ఆట మొదలయి నందుకు సంతోషంగా అరుచుకుంటూ కవర్లమీదపడింది చిలక.

అలా చాలాసేపు సీతారావమ్మ కూర్చున్నదక్కడ. తను అక్కడ కూర్చుంటే జనం వస్తారని ఆమెకి తెలుసు. వస్తే సన్యాసీ. ఆనక తనూ. నాలుగు డబ్బులు చేసుకోవడం ఆమెకి తెలుసున్న రివాజు.

*　　*　　*


## డబ్బు కావాలా?

రూ. 11/-లు పెట్టుబడితో మా (చైను పద్ధతి) స్కీములో సభ్యులుగా చేరి మీ బంధు మిత్రులను చేర్పించడం ద్వారా ఇంట్లో కూర్చుని ప్రతిరోజూ మనియార్డర్ల ద్వారా రూ 34,952/-లు లాభం పొందండి

Sri Vigneswara Money Circulation

Govt. Regd No-711.
Guindy. Madras-32.

ఉచితం　ఉచితం　ఉచితం

## తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గలవారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిని పొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును మొదటి కోర్సుతోనే మచ్చల రంగు మారడం ఆరంభమవుతుంది. జబ్బు వివరాలు వ్రాయండి.

GAUTAM CHIKITSALAYA
(S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

డా॥ పి. వి. కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్, వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్ర స్ఖలనము-శుక్లనష్టము, సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావ్స్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

SUVARNA


వీధి లైటు వెల్తురులో రాత్రి ఎనిమిది గంటలకి ఏడుకొండలు ఆత్రంగా సన్యాసి మాటలు వింటున్నాడు. మండలం రోజులు శనియోగం. మహర్దశ.... ఇలా ఏవోకొన్ని మాటలు అర్థంకాకపోయినా మొత్తంమీద తన బ్రతుకు ముందు ముందు బాపుంటుందని తేలింది ఏడుకొండలకి. పదిహేనేళ్ళుగా ప్యాన్‌గా ఎదుగూబొదుగూ లేకుండా అటు కుమ్మర వీధిలో, ఇటు మెయిన్ రోడ్డులో స్వంత ఇళ్ళతో ఇద్దరు పెళ్ళాల నేలుకుంటూ ఇంకా జీవితంలో తన లోటుకోసం బాధపడపోతున్న ఏడుకొండలు సన్యాసి మాటలకి, అంటే చిలక జోస్యానికి కాస్తంత పొంగిపోయాడు. అలా అప్పుడప్పుడు తను జోస్యం చెప్పించుకుంటూండడం, పొంగి పోతూండడం అలవాటు.

"ఏటా కులుకు? ఈ బతుకు చాల్దేటి?" పరసంగా చెప్పాలంటే కవ్వింపుగా అన్నది సీతారావమ్మ. అప్పుడామె తెల్ల వాయిల్ చీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని, కిళ్ళీ వేసుకుని నలుపైనా పౌడరు రాసుకుని ఇంచక్కా వుంది. పగలుకంటే చాలా బావుంది.

ఇంతలో అప్పారావొచ్చాడు. వచ్చి బీడీ అంటించాడు. "ఏటా పొగరు- సచ్చినోడా." తిట్టుకుంటూ మీదకొచ్చిన బీడీ పొగని చేత్తో విసురుకున్నది సీతారావమ్మ

"బీడీ ఇమ్మంటావేటి?" ఆమెని అడిగాడు అప్పారావు.

"అడగాలేకానీ పిల్టరు సిగరెటియ్యనూ" పప్పుల బండి పక్కన ఆపి దగ్గరకొస్తూ అన్నాడు రామారావు.

"సీ! సచ్చినోల్లాలా.." చెయ్యి జాడించిందామె. ఆ దెబ్బ నరసింహులికి తగిలింది.

"ఏటత్తా నన్ను కొడతావ్. నానేటి సేస్తా." అన్నాడు వాడు కొట్టినచోట తడుముకుంటూ.

"ఓరి నర్శివ్వా. నిన్ను సూల్లేదురా. ఈ రావిగాడ్ని కొట్టబోయా."

"చరేగాని చన్నాసిబాబూ మా అత్త జాతకం సూడు...."

"పోరా పోకిరీ నాయాల. మన చాతకాలు యేరే సూడాల్రటా. నువ్వు రిచ్చాతొక్కుతున్నావా! నేను ఈ తెల్ల సీర యేసం ఏసి ఇక్కడున్నా...."

"కరక్టు.... సన్నాసిమాయ్యా అసలు నీచాతకం యెప్పుడన్నా సూసుకున్నావా?" రామారావు.

"అవునుబాబూ మా అందరి చాతకాలు సూత్తన్నావ్ గందా. అసలు నీ యవ్వారం సూసుకోవేందీ. ఏటత్తా ఏవంటవ్ నువ్వు."

"ఇంతకీ సన్యాసి జాతకం చూసుకోవాలంటావ్." అప్పారావు మరో బీడీ అంటించాడు.

"కాటికి కాళ్ళు జాపాడు, ఇంక జాతకం ఏం చూసుకుంటాడ్లే." అని లేచాడు ఏడుకొండలు.

"అమ్మమ్మ అట్లా అనమాకు. ఇప్పుడో లాటరీ టిక్కెట్టు కొన్నాడనుకో. అయిదు లచ్చలొచ్చేసిందనుకో. అప్పుడేవంటావ్. లచ్చాధికారె పోడూ" అప్పారావూరించాడు.

"మాలావు మాట సెప్పావ్‌రా." రామారావు పొంగిపోయాడు. ఆ తర్వాత ఆశపడ్డాడు. తనకీ అలా వొచ్చేస్తే ఎంత బాగుండునని.

"అంతే షరి.... లే చన్నాసి బాబూ. ఇదిగో ఈ పావలా సిలక్కాడెట్టి చాతకం సూపిచ్చుకో. మరి సూసీవోడెవడూ .."

"సదువొచ్చిన ఏడుకొండలు యెల్లిపోయాడు. ఇంకెవరు అప్పారావే" రామారావు.

ఆఖరిదమ్ము పీల్చి బీడీ అవతల పారేశాడు అప్పారావు. అంతా బలవంతం చెయ్యగా "పోనే ఆల్లి సర్దా తీర్చు" అన్న సీతారావమ్మ మాటకే సన్యాసి అక్కణ్ణుంచి లేచాడు. అప్పారావు సీట్లో కూర్చున్నాడు.

రోజూ ఎందరికో జాతకాలుచూస్తూ ఆశలు కల్పిస్తూ, అందులో కొందరు "నువ్వు చెప్పినట్లే జరిగిందని", మరి కొందరు "ఏ వక్కటీ జరగలేదని" ఇలా అంటూంటే వింటూ ఏవో వాళ్ళకి సర్ది చెబుతూన్న సన్యాసికి ఆశ పుట్టింది.

అప్పారావన్నట్లు తన శేష జీవితంలో ఏ మెరుపుందో ఏ తళుకుందో.. నర్సింహులిచ్చిన పావలా చిలక ముందు పెట్టాడు సన్యాసి. అప్పారావు చిలకని బయటికి వదిలాడు.

"గత నాలుగేళ్ళుగా నీకు శనిపట్టుకుంది. మూడు మాసాలు గడిచిన తర్వాత మహర్దశ ప్రారంభం అవుతుంది. కోరికలు తీరుతాయి. శుభ పుణ్య కార్యాలు చేస్తారు. పదిమందిలో రాణిస్తారు. మీ శత్రువులు మీకు లొంగుతారు. తీర్థయాత్రలు చేస్తారు...." అంటూ చిలక జోస్యాన్ని ముగించాడు అప్పారావు. అంతా ఒక్కసారి ఆనందంగా కేరింతలు కొట్టారు.

సన్యాసి మనస్సు చివుక్కుమన్నది. ఇదంతా బూటకం అని వాళ్ళంతా అరిస్తే బాగుండుననిపించింది. "ఎన్ని గుండెల్లో ఈ అబద్ధాల్ని నాటుతున్నాడు తను...." నిర్లిప్తంగా ఇంటి ముఖం పట్టాడు. తన ఏభై య్యేళ్ళ వార్ధక్యం ఒక్కసారిగా అతని మీద పడినట్లయ్యింది. వణికిపోయాడు వంగిపోయాడు. తనిచ్చే గుడ్డతో యౌవ్వనాన్ని దాచుకోలేకపోతున్న పదహారేళ్ళ కూతురు కళ్ళల్లో మెదిలింది. చదువు చెప్పించలేక, పని కల్పించలేక సమస్యగా వదిలేసిన పదమూడేళ్ళ కొడుకూ తన గుండెల్ని దూసుకొచ్చేడు. తన వృత్తి నిజమా, అబద్ధమా అన్నది తనకి తెలుసు.

నులకమంచంమీద పడుకుని గుడిసె పైకప్పుకేసి చూస్తున్నాడు సన్యాసి. రివ్వున గాలి వీచింది. చిమ్నీలేని దీపం ఆరిపోయింది. నల్లగా అంతా చీకటిగా అనిపించింది సన్యాసికి.

తెల్లారి ఏడు గంటలు దాటుతూంది.

వళ్ళంతా నొప్పులతో, పచ్చిపుండులా వున్న సీతారావమ్మ మరికాస్సేపు పడుకుందామనుకుంటున్న అవస్థలో.

"అత్తోయ్ బేగిరాయె.... సన్నాసి బాబు సచ్చిపోనాడు." అన్న నర్శింహులు కేకకి ఉలిక్కిపడి లేచింది.

"ఏటి. పొద్దున్నే షుక్కు.." ముడేసుకున్నది.

"కాదత్తా.... సత్తెం." ఆమె చేతిలో నర్శింహులు ఒట్టేశాడు.

"ఓర్నాయినో.... ఏవొచ్చినాదిరో బాబూ.... వదరో...." ఏడుస్తూనే సన్యాసి గుడిసెవైపు పరుగెట్టింది.

జబ్బేమీ లేదు. రాత్రి ఇంటికొచ్చి కూడు తిని మంచం మీద పడుకున్నాడు. తెల్లారి సూసేసరికి చచ్చి పడున్నాడు. ఎక్కిళ్ళ మధ్య కూతురూ, బావురుమంటూ కొడుకు చెప్పారు.

"గుండె జబ్బుండాల—ఆమొక్క మందు కూడా ఇచ్చేను ఏసుకోమని." అంటూ అక్కడున్న ఏడుకొండలన్నాడు.

ఏడుపుతో అలసిపోయిన సన్యాసి కూతుర్ని చూసింది సీతారావమ్మ. పేదరికంలో ఆమె యౌవనాన్ని చూసింది. నెమ్మదిగా ఆమె దగ్గర కెళ్ళింది.

"ఏడవమాకు నేనున్నాను. వొవల్లూ లేకపోయినా నే బతగ్గాలేంది నీకు బాదేంటి ఏడవమాకు." ఆమెను తన గుండెల్లోకి తీసుకున్నది సీతారావమ్మ.

అదేమాట సన్యాసి కొడుకుతో నర్శింహులూ అన్నాడు. ★

"College of B.A, B.Com Entrance
Correspondence Courses & Oral
Courses of study, Matric, Inter, B.A, B.Com.
Opp II Town Police Station, Visakhapatnam-20.

# Material Ready

Those who complete 20 years are directly eligible for B.A B.Com, Entrance Courses without Minimum Qualification
Prospectus by M O 3-50 Tution fee Rs 200/-
*First Batch oral Classes Admissions are already started*"




**కేశవర్ధినిని**

మీరు తలకు రాసుకొనే నూనెలో కలిపి ఉపయోగిస్తే అధికంగా మంచి గుణాన్ని పొందుతారు. మీ తల వెంట్రుకలు ఒత్తుగా రోజు రోజుకీ పొడుగ్గా పెరుగుతాయి.

దక్షిణ భారతదేశపు సాంప్రదాయిక కేశ సౌందర్య రహస్యమే కేశవర్ధిని మీరు వాడుకొనే తలనూనెలో కేశవర్ధినిని కలిపి ప్రతీ రోజూ తలకురాసి తల చర్మానికి అంటేటట్లు చేయండి. మీ తల వెంట్రుకలు ఊడిపోకుండా జేసి ఆరోగ్యవంతంగా అందంగా పెరిగించడానికి ఇదే మంచి మార్గము ఇప్పుడే కేశవర్ధినిని ఉపయోగించడం మొదలు పెట్టండి. కేశవర్ధిని సాధారణ తల నూనె కాదు. దీన్ని కొబ్బరినూనెలోనో లేక మీరు వాడే ఇతర తల నూనెలోనో కలిపి వాడాలి.

కేశవర్ధిని ప్రోడక్ట్స్, ఆర్కాటు రోడ్డు, మద్రాసు—600 087

OBM 3837/2 TO